


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబ్లమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# గుండమ్మ కథ - 8

గంటన్న: కొంపమునిగింది. చెల్లాయ్, వీడు వాడే! గోపాలం ఇంట్లోవాడు. అమ్మాయి తిరిగేది వీడితోనే.

గుండమ్మ:ఆఁ!? –సరోజ,రాజా మెట్లు దిగి వస్తారు.

గుండ: ఏమే. నిజమేనా?

సరో: నిజమే.

గుండ–– రాజాతో: ఏమయ్యా పెద్దమనిషీ. నీకేమైనా బుద్ధుందా లేదా? రామభద్రయ్యగారి కొడుకునని చెప్పి మా ఇంట్లో దొంగతనంగా దూరుతావా?

రాజా: ఏఁవమ్మోయ్. మాటలు జాగ్రత్తగా రానీ. దొంగతనంగా ఏం రాలా. దొరతానంగానేవచ్చా. పిల్లని చూడ్డానికి రమ్మని ఇదా నువ్వుచేసే మర్యాద? ఇంకా నయం. తొందరపడి చేసుకున్నాం కాదు. బోడి సంబంధం.

గుండ: ఏమిటా గద్దరితనం? పైగా ఎదురుతిరుగుతావా? చూస్తావేం అంజీ. ఎముకలు విరగ్గొట్టక.

అంజి: నువ్వుండు గుండత్తా. నే చెబుతాగా. బుల్లోడా ఇలారా. కూర్చో. –సోఫాలో కూర్చోబెట్టి –ఏంటి నీ కథ, కమామిషూ? నువ్వెవరు? ఏవూరు? ఎందుకొచ్చావ్?

రాజా: ఇందాకా చెప్పాగా?

అంజి: నువ్వు చెప్పావు.నేనూ ఇన్నాలే. పరవాలేదు. నిజం చెప్పు.

రాజా: ఇందాక చెప్పింది నిజమే.

అంజి: నిజం నువ్వేంది అని రుజువేందీ అంట. ఇదుగో బుల్లోడా. నువ్వు ఫలానా అని రుజువుచేసుకున్నావా పిల్లనిచ్చి పెళ్ళి చేస్తాం. లేదా బుర్ర రామకీర్తన పాడించేస్తా.

రాజా: ఇంతకీ నువ్వెవరు అడగడానికి?

అంజి:ఏహేహె. అప్పుడే మరిచిపోయావా బుల్లోడా. ఇందాక పైకి పంపేటప్పుడు ఈ మాట అడగలేదే?

రాజా: అది వేరు.

అంజి: ఆఁ. ఈ పప్పులు మనదగ్గర ఉడకవు. నువ్వెవరో ముందు రుజువు చేసుకో.

రాజా: ఏమిటి రుజువు చేసుకునేది? ఇదుగోపిల్లని చూడ్డానికి పంపిన ఆ అమ్మాయి ఫొటో.

అంజి: అరెరె. ఇంకేముంది గుండత్తా? పిల్లాడు రుజువు చూపించాడు.–– సరోజ రాజా వద్దకు వస్తుంది. గుండమ్మ ఫొటో చూస్తుంది. : ఔను నాయనా . తెలీక అన్నాను. ఏమీ అనుకోకు నాయనా. నేను తొందరపడితే నువ్వేనా చెప్పొద్దా అన్నయ్యా?

అంజి: మనని దొడ్డిదారినపెట్టింది గంటన్నేకదా గుండత్తా? మంచిరోజు చూసి ముహూర్తం పెట్టించేద్దాం.

రాజా: ఉండండి. మా నాన్నగారికి ఉత్తరం రాసి కనుక్కోవాలి.

అంజి: కనుక్కో. మా ఏర్పాట్లేవో మేం చేసుకుంటాం. –సరోజతో: కొంచెం జాగ్రత్తగా చూస్కో. కుర్రాదు చలాకీగా ఉన్నాడు. పద గురూ పద. –లక్ష్మి కాఫీ తెస్తుంది.

గుండమ్మ: అన్నయ్యా పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ చేయించు.

అంజి: అందుకూ గంటన్నే దొరికాడా గుండత్తా? అదంతా నేచూస్కుంటాగాని ఇంట్లో పెళ్ళికాని పెద్ద ఆడపడుచు బుల్లెమ్మని అలాగే అట్టేపెట్టి చిట్టెమ్మకి ఎట్లా పెళ్ళి చేస్తారూ అంట.

గుండ: అలాగేలే. అన్నయ్యా లక్ష్మికి ఏదైనా సంబంధం చూడు.

అంజి: సంబంధం చూడాలా? అసలు మీకళ్ళకి పొరలుకమ్మినైలే. ఇంట్లో మనిషిని పెట్టుకుని ఊరంతా చూస్తారేంటి?

గంట: ఇంట్లో ఎవరున్నారోయ్?

అంజి: ఎద్దంత మనిషిని నేనులేనూ?

గంట: నీకా?లక్ష్మిని ఇచ్చి పెళ్ళా?

అంజి: ఏం? నాకంటె మంచోడెవడొస్తాడు? తీసుకురా చూద్దాం? –గుండమ్మవైపు తిరిగి——ఏం గుండత్తా. నాకు పెళ్ళిచేస్తానంటివే? బుల్లెమ్మకో పిల్లాడిని తెచ్చి, నాకో పిల్లని తెచ్చి ఇదంతా గొడవగొడవకాదూ? మా ఇద్దరికీ ముడెడితే చిలకాగోరింకల్లా నీ కాళ్ళదగ్గిరే పడుంటాంగా?

గుండ: నిజమే అన్నయ్యా.

గంట: సరేలే. వీడికి పిల్లనిస్తే మనమాట విన్నట్లే.

అంజి: ఇప్పుడు నేను వింటున్నానుగనకనా? ఇదుగో గంటన్నా. నువ్వు చేసేదిలేదు చచ్చేదిలేదు. పంతానికి నాకు ఎదురొస్తున్నావ్. నాకట్టే తిక్కరేగిందంటే నీ ఒళ్ళు పంబరేగుద్ది జాగ్రత్త .

గంట: చాల్లేరా వేళాకోళాలు.

అంజి: వేళాకోళాలేంటయ్యా? తంతానంటుంటే? ఏం గుండత్తా అంతేనా?

గుండ: సరేలేరా. –అంజి సంబరంగా గంటన్నని పట్టుకుని గిరగిరా తిప్పుతాడు.

★★★

గంటన్న ఇల్లు–భార్య: గుండమ్మకూతురుకి సంబంధం కుదిరిందటగా?

గంట: ఎవరా చెప్పింది?

భార్య: ఎవరు చెప్పేది? పిల్లని చూసి ఖాయం చేసుకున్నారంటగా?

గంట: ఓసి పిచ్చిదానా? నేనంత సులభంగా వదిలేస్తానూ? రామభద్రయ్యకి ఆకాశరామన్న ఉత్తరం రాసేశాను. ఈదెబ్బతో పీటలమీది పెళ్ళి హాంఫట్!

★★★

రామభద్రయ్య భవనంలో నౌకరుతో——ఉత్తరం చూసి : మన అంజికి పెళ్ళట!

నౌకరు: మరి చిన్నయ్యకో?

రా.భ: ఇదిగో ఆ ఉత్తరంకూడావుంది. కవరుచింపి ఉత్తరం చదువుతూ: "ప్రియమైన నాన్నగారికి, రాజా వ్రాయునది. నమస్కారం. (సభ్యత గమనించండి) పిల్లని చేసుకోమని బతిమాలుతున్నారు. ఇల్లరికం ఉండాలిట. మీకీ సంబంధం ఇష్టం లేదని ఘాటుగా రాయండి. అప్పటికీ వాళ్ళు ఇష్టపడితే చేసుకుంటాను–ఇట్లు, రాజా" .మరొక కవరు చింపి——"రామభద్రయ్యగారికి నమస్కారములు. (నక్క వినయాలు) మీరు రొంపిలో దిగుతున్నారు. గుండమ్మతో వియ్యమ్మమందితే కొరివితో తల గోక్కున్నట్లే. ఆవిడ మొగుడికి మందు పెట్టి చంపింది. కూతురు తల్లికంటె ఐదాకులు ఎక్కువ చదివిందిజాగ్రత్త. తర్వాత మీ ఇష్టం.——మీ శ్రేయోభిలాషి...ఆకాశరామన్న" (నమ్మకద్రోహం)

నౌకరు:ఈదెవడు బాబూ?

రా.భ.:అక్కడ గంటయ్య అని ఒక పెద్దమనిషి ఉన్నాడులే. ఇది వాడిపనే అయ్యుంటుంది.

★★★

పెళ్ళిబాజాల background music– అంజి ,లక్ష్మి పెళ్ళిబట్టల్లో వచ్చి గుండమ్మకు పాదాభివందనం చేస్తారు. వెనక గంటన్న వస్తాడు. గుండమ్మ దంపతులను భర్త ఫొటొ వైపు పంపిస్తుంది. పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు ఫొటోకి నమస్కరిస్తారు.

గంట: చెల్లాయ్. గుళ్ళోపెళ్ళి బ్రహ్మాండంగా జరిపించాననుకో. ఖర్చు మూడురూపాయల ముప్పావలా.

అంజి: ఎంత గుళ్ళొపెళ్ళయితేమాత్రం? ఈ గంటన్న తూతూమంత్రం చేశాడు. ఏదీ ఒక రూపాయి ఇట్లాగియ్యి. సాయంత్రం అట్లా రిక్షామీద తిరిగొస్తాం.

గంట: ఈ దెబ్బతో నీ దరిద్రం తీరిపోయింది. బంగారంలాంటి పెళ్ళాం దొరికింది.

అంజి: ఎప్పుడుమాత్రం నాకేంలోటు? దరిద్రం మొహం నీదికాని?——పోస్ట్ మాన్  ఉత్తరం తెచ్చి ఇస్తాడు. : ఇదిగో గంటన్నా. ఉత్తరం చదువు.

గంట: రామభద్రయ్యగారి దగ్గర్నుంచి. –(అంజి శ్రద్ధగా అతని ముఖకవళికలని గమనిస్తాడు)

గుండమ్మ——ఆశగా——తడిగుడ్డతో గొంతులుకోసే అతడినే నమ్ముకుని: ఏమని రాశారన్నాయ్యా?

గంట: గంగా భాగీరథి సమానురాలయిన గుండమ్మగారికి. రామభద్రయ్య వ్రాయునది. ఇంటికి  వచ్చి అంతా గమనించాను. ఊళ్ళో మీ పేరుప్రతిష్ఠలు విన్నాను.

అంజి: బావుంది బావుంది.చదువు చదువు.

గంట: మాబోటివాళ్ళతో వియ్యమందే అర్హత మీకు లే...దు.

గుండ–హతాశురాలై: ఆఁ?(Basicalగా ఆమె అమాయకురాలు)

గంట:మీ పిల్లను మేము చేసు...కోము.(లోపల ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ) ఒకవేళ మీరు మభ్యపెట్టి మావాడికిచ్చి పెళ్ళి చేసినా వాడు ఈ గడప తొక్కడానికి వీ...ల్లేదు. నా ఆస్తిలో ఒక్క దమ్మిడీకూడా వాడికివ్వను. ఇది గ్రహించవలెను–ఇట్లు...రామభద్రయ్య"

గుండ:ఎంత అప్రదిష్ట. ఎంత అప్రదిష్ట.

గంట: ఇదికూడా ఒకందుకు మన మంచికేలే.

గుండ: మంచేమిటన్నయ్యా? కొంప మునిగిపోతేనూ?

అంజి: ఏం మునిగిపోలేదు గుండత్తా. బుల్లోణ్ణి కనుక్కుని పెళ్ళి చేసేద్దాం.

గంట——(చెడగొట్టడానికి) :వాళ్ళకి పిల్లనిస్తామయ్యా? మంచీమర్యాదా లేకుండా నానా తిట్లూ తిట్టేశాడు. అసలు వాళ్ళు మళ్ళీ బతిమిలాడినా మనపిల్లని వాళ్ళకివ్వం. –As though he is the deciding factor! మన పిల్లకి పెళ్ళికాకుండాపోతుందా? దీని తాతలాంటి సంబంధం తీసుకొస్తాను.

అంజి: ఎంతైనా నీ ఎదవ బుద్ధి పోనిచ్చావుకాదు గంటన్నా. ఏదైనా పేచీవస్తే కలపడానికి చూస్తారుగాని ఇడగొడతానంటావేంటీ అంట. ఇంతకీ పిల్లాడు పెళ్ళికి ఒప్పుకున్న తర్వాత తండ్రి ఒప్పుకోకపోతేనేం?

గంట: కొడుకుని గడప తొక్కనివ్వనంటుంటే ఏం చేస్తావోయ్?

అంజి: పిల్లాడు ఇక్కడే ఉంటాడు. మనం కోరుకునేదీ అదేకదా? ఏం  గుండత్తా. దీనికే దిగులుపడతావెందుకు? పిల్ల, పిల్లాడు నీ కంటిముందుంటే మంచిదేగా? ఆఁ. నాకు తెలవక అడుగుతానూ. చిట్టెమ్మ అత్తారింటికెళ్ళిపోతే బెంగెట్టుకుని మూడోనాటికి గుండత్త మంచమెక్కదూ? లక్షణంగా పెళ్ళిచెయ్యక అట్టా ఏడుపు మొకాలెడతారెందుకూ అంట?

గుండ: అదికాదు నా దిగులు. తండ్రి వద్దంటే ఆ పిల్లాడుమాత్రం చేసుకుంటాడా అని?

అంజి: బుల్లోడి సంగతి చిట్టెమ్మ చూసుకుంటది. మనకెందుకు? ఐనా పెద్దోళ్ళొద్దంటే చేసుకోదలచినోడు ఊరుకుంటాడా? ఉండు గుండత్తా నువ్వుండు. బుల్లోణ్ణి తీసుకొస్తానుండు. –––చీకట్లో చిరుదీపం లాంటి ఆ భరోసాతో గుండమ్మ కుదుటపడి సంతోషిస్తుంది. ––రాజా అంజికి ఎదురుపడతాడు.

అంజి: ఏం బుల్లోడా. మొకం ఏలాడేశావ్? నీకూ ఉత్తరమొచ్చిందా? మాకూ వచ్చిందిలే. ఈ పెద్దాళ్ళకుండే చిక్కులే ఇవి. ముందు చిర్రుబుర్రులాడుతారు. తర్వాత వాళ్ళే కాళ్ళబేరానికి వస్తారు. ఐనా ఎంతకాలం మీ నాన్న పట్టుదల? నేనూ చూస్తాను. నీకేం లక్షణంగావచ్చి ఇక్కడే వుండు. –రాజాని సోఫాలో కూర్చోబెడతాడు. –ఏం గుండత్తా మాట్లాడవేం?

గుండ(ఆనందంగా) అంతకన్నానా? అబ్బాయి ఉండాలేగానీ  పువ్వుల్లోపెట్టి పూజించుకోమూ?

అంజి: ఇంకేంటి బుల్లోడా?

రాజా: ఐనా ఇల్లరికం అంటే చులకన.

అంజి: గంటయ్య వైపు చూస్తూ--నిన్నిక్కడ చులకనచేసేదెవడంట. నేనిక్కడ ఉండనే ఉంటాగా? ఎవడైనా పల్లెత్తుమాటంటే పళ్ళు రాలగొట్టనూ?

గంట——పుచ్చకాయల దొంగలాగా: అనేవాళ్ళు మన ఎదట అంటారా?

అంజి: వాళ్ళతో నీలాంటి కుక్కలు ఎన్ని మొరిగితే లెఖ్ఖేమిటంట.

గంట: హఁహఁ. నేను కుక్కనా?

అంజి: ఏదో మాటవరసకన్నాలే గంటన్నా. ఐనా కుక్కకీ నీకూ పోలికేంటి? కుక్కకి విశ్వాసం వుంది. ఆ గుణం నీకెక్కడిది?

గంట–ఉక్రోషంతో: ఇదుగో చెల్లాయ్. ఇప్పుడే చెప్తున్నాను. ఈ సంబంధం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు.

అంజి: నీ ఇష్టం ఎవడిక్కావాలి? బోడి ఇష్టం.

గంట: ఏం. మాటలు తెగ మీరిపోతున్నాయ్?

అంజి: అంతటితో ఆపేను.సంతోషించు.

గంట: ఐతే మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. నే వెళ్ళిపోతున్నాను. —అంజి గంటన్న కోటు పటుకుని ఆపి: ఆగాగు. నువ్వుపోతే ఈ వెట్టి చాకిరీ అంతా ఎవడు చేస్తాద్దు?ఏం గుండత్తా మాట్లాడవేం? కుర్రాడు సందేహిస్తున్నాడు.

గుండ: ఎందుకయ్యా సందేహం? ఈ ఇల్లంతా నీదే, మహరాజులా ఉండొచ్చు.

అంజి: ఏం బుల్లోడా. ఇంకా సందేహపడతావేం? ఒప్పేసుకో. —రాజా అంగీకారసూచకంగా తల ఊపుతాడు. —సరే మీరింతగా చెపితే...

అంజి:ఆఁ. అద్గదీ మాట.

గంట: పిచ్చోడు పిచ్చోడు అనుకున్నాం. అసాధ్యుడేనే?

అంజి: ఉన్నోళ్ళంతా ఎదవలైతే మనతెలివికేం? దివిటీలాగ ఎలిగిపోదా అంట. ఇక పెళ్ళి ఏర్పాట్లు కానీండి. ఇదుగో గంటన్నా. నా పెళ్ళిలాగ తూతూమంత్రం చేసేవు. వీపు చిట్లిపోద్ది. తమ్ముడిపెళ్ళి మంచి వైభోగంగా జరగాలి. రా తమ్ముడూ రా. —

రాజా,సరోజలపెళ్ళి వైభవంగా జరుగుతుంది.

---విశ్రాంతి--

(సశేషం)

★★★

COMMENTS